ఏటా 40 వేల కోట్ల ఆదాయాన్ని ఇస్తున్నాం

- కార్పొరేషన్‌పై తప్పుడు వార్తలొద్దు
- జూపల్లితో బేవరేజెస్ ఉద్యోగులు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వానికి ఏటా రూ.40 వేల కోట్ల ఆదాయాన్ని సమకూర్చుతున్న తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్‌పై కొందరు వ్యక్తులు, మీడియా సంస్థలు బురద జల్లడాన్ని ఉద్యోగులు తీవ్రంగా ఆక్షేపించారు. ఈ మేరకు తమకు అండగా నిలవాలని కార్పొరేషన్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నాయకులు, తెలంగాణ ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు శుక్రవారం ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావుని కలిసి విన్నవించారు. కొన్ని మీడియాల్లో వస్తున్న అసత్య వార్తలను ఖండిస్తూ వాస్తవాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కార్పొరేషన్‌లో 280 మంది ఉద్యోగులు పని చేయాల్సి ఉండగా, 104 మంది ఉద్యోగులే రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడుతున్నారని వివరించారు. ప్రత్యక్షంగా 1,800 మంది హమాలీ కార్మికులు, అనుబంధంగా 5 వేల కుటుంబాలకు పరోక్షంగా బేవరేజెస్ కార్పొరేషన్ జీవనోపాధి కల్పిస్తున్నదని, ఇకనుంచైనా తప్పుడు వార్తలు రాయకుండా చూడాలని కోరారు. సంస్థపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని విన్నవించారు. తాను కూడా ఉద్యోగుల పక్షానే ఉంటానని జూపల్లి హామీ ఇచ్చారు. అనంతరం వారు ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. కలిసిన వారిలో తెలంగాణ ప్రభుత్వరంగ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదారి జీటీ జీవన్, అధ్యక్షుడు, బ్రూవరీస్ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం కాశీనాథ్, ఉపాధ్యక్షుడు శ్యామ్‌కుమార్, అడ్వైజర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బేవరేజెస్ కార్పొరేషన్ జీఎంపై బదిలీ వేటు?

తనకు తెలియకుండా కొత్త మద్యం కంపెనీలకు అనుమతులు ఇచ్చారని పేర్కొన్న ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహంపై బదిలీవేటు వేసేందుకు సిద్ధమైనట్టు తెలిసింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో.. చార్జిషీట్ తిప్పి పంపిన కోర్టు

నాంపల్లి కోర్టులు, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో పంజాగుట్ట పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్‌ను కోర్టు వెనక్కి పంపింది. చార్జిషీట్‌లో తప్పులు దొర్లాయని సరిచేసి సమర్పించాలని అధికారులను కోర్టు ఆదేశించింది. సాక్ష్యాధారాలు, కీలక పత్రాలకు సంబంధించిన వివరాలను చార్జిషీట్‌లో పొందుపర్చినప్పటికీ వాటిని కోర్టుకు సమర్పించలేదని గుర్తుచేసింది. పూర్తి సమాచారంతో చార్జిషీటును దాఖలు చేయాలని, తప్పులను సవరించి ఆధారాలకు సంబంధించిన జాబితా ప్రకారం వస్తువులను, పత్రాలను కోర్టుకు అందించాలని సూచించింది. ప్రధాన నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఓ మీడియా సంస్థ ప్రతినిధి శ్రావణ్‌కుమార్ విదేశాలనుంచి రాగానే వారినుంచి సేకరించాల్సిన సమాచారాన్ని జోడించి చార్జిషీట్‌ను దాఖలు చేయాలని పోలీసులు యోచిస్తున్నారు. ఇప్పటివరకు సేకరించిన వస్తువులు, కంప్యూటర్లకు చెందిన డిస్క్‌లు, పెన్‌డ్రైవ్‌లు, పత్రాలను అధికారులు గోప్యంగా ఉంచారు. ఎస్ఐబీ మాజీ అధికారి ప్రణీత్‌రావుకు చెందిన లాప్‌టాప్‌ను జప్తు చేసినట్టు అధికారులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నప్పటికీ దానిని కోర్టుకు సమర్పించలేదు. రాజకీయ నాయకుల పేర్లను సైతం ప్రస్తుత చార్జిషీటులో చేర్చలేదని సమాచారం. సరైన సమయంలో అందరి పేర్లతోపాటు వారికి సంబంధించిన సాక్ష్యాధారాలను జతచేసి చార్జిషీట్ దాఖలు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

వీడియోకాల్ మాట్లాడుతూ ఆత్మహత్య

దుండిగల్, జూన్ 21: యువతితో వీడియో కాల్ మాట్లాడుతూ ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే... మెదక్‌జిల్లా కౌడిపల్లి మండలం కన్నారం గ్రామానికి చెందిన జుమ్లూపత్ రాజు తన భార్య, సోదరుడు శ్రీకాంత్ (22)తో కలిసి రెండేండ్ల క్రితం ఉపాధి కోసం వచ్చి దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ సాయిపూజకాలనీలో అద్దె కుంటున్నారు. అన్నావదిన సొంత ఊరికి వెళ్లగా గురువారం రాత్రి శ్రీకాంత్ మరో ముగ్గురు బంధువులతో మద్యం తాగారు. ఈ క్రమంలోనే ఓ యువతి అతనికి ఫోన్‌చేసింది. మిగతా వారు బిర్యానీకి బయటికివెళ్లగా, శ్రీకాంత్ ఆ యువతితో వీడియోకాల్ మాట్లాడుతూ తాడు తో ఉరేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీస్ అధికారి లైంగిక వేధింపుల నుంచి రక్షించండి

- హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బాధితురాలు

హయత్‌నగర్, జూన్ 21: పోలీస్ అధికారి లైంగిక వేధింపుల నుంచి రక్షించాలని కోరుతూ ఓ బాధితురాలు శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాల్లోకెళ్తే... అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మునగనూరులో సువర్చల, కిరణ్‌కుమార్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఏసీబీ డిపార్ట్ మెంట్‌లో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి నంటూ శేఖర్ అనే వ్యక్తి కొంతకాలంగా సువర్చలను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో మనోవేదనకు గురైన బాధితురాలు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- జయశంకర్ సార్‌కు నివాళి

తెలంగాణ భవన్‌లో శుక్రవారం జయశంకర్ సార్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, నాయకులు బాల్కసుమన్, బండ ప్రకాశ్, దేవీప్రసాద్, పొన్నాల లక్ష్మయ్య, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలుపుకోవటంలో కేసీఆర్ ఆదర్శం

- అధికారంలోకి రాగానే పెన్షన్లు పెంచారు
- రేవంత్ సర్కారు పెన్షన్ బాకీ రూ. 6,223 కోట్లు
- ఆ డబ్బులతోనే రుణమాఫీ చేసే ప్రయత్నాలు : మందకృష్ణ మాదిగ

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదర్శవంతుడు అని, అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లు పెంచారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ కొనియాడారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. పేదల సంక్షేమానికి కట్టుబడి ఇచ్చిన మాటను కేసీఆర్ నిలబెట్టుకున్నారని, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లను పెంచి, అమలు చేశారని వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.1,000, రూ.2,000 పింఛనును లబ్ధిదారులకు సకాలంలో అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారని గుర్తుచేశారు. ఏపీలో ఇటీవల అధికారం చేపట్టిన చంద్రబాబు కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి ఏప్రిల్ నుంచి పెన్షన్లను అమలు చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్, చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలని, సీఎం రేవంత్‌రెడ్డి కూడా తన మాటను నిలబెట్టుకోవాలని సూచించారు. వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్లను తక్షణమే పెంచి, డిసెంబర్ నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళల హక్కుల పరిరక్షణకు ఎమ్మార్పీఎస్ 17 ఏండ్లుగా ఉద్యమం చేస్తున్నదని తెలిపారు. వారి సంక్షేమానికి అడ్డుపడే ప్రభుత్వాన్ని కచ్చితంగా నిలదీస్తామని స్పష్టం చేశారు.

7 నెలల పెన్షన్ బాకీ 6,223 కోట్లు

రాష్ట్రంలో పెన్షన్‌దారులకు రేవంత్ సర్కారు 7 నెలలకు గానూ రూ.6,223 కోట్లు బాకీ పడిందని మందకృష్ణ తెలిపారు. ఆ డబ్బుతోనే రైతు రుణమాఫీ చేయాలని ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. అన్నిరకాల పింఛన్లపై ప్రతి నెల రూ.889 కోట్లు అవుతుందని, ఆ లెక్కన లబ్ధిదారులకు రూ.6,223 కోట్లు అందాలని వివరించారు. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. రుణమాఫీ అమలు కోసం తర్జనభర్జన పడుతున్న రేవంత్ సర్కార్.. ఇతర శాఖల నిధులను మళ్లించి రుణమాఫీ అమలు చేయాలని చూస్తున్నదని విమర్శించారు. ఉన్నోన్ని కొట్టి లేనోనికి పంచాల్సిన ప్రభుత్వం.. లేనోన్ని కొట్టి భూములు, జాగాలు ఉన్న ఉన్నోడికి రుణమాఫీ రూపంలో పంచాలను కుంటున్నదని ఆరోపించారు. దివ్యాంగురాలు రజనీకి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చినంత హడావుడి చేసి వ్యవసాయశాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కట్టబెట్టి రేవంత్ దగా చేశారని మండిపడ్డారు. ఈ నెల 25న దివ్యాంగుల పోరాట హక్కుల సంఘాలతో రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని, అప్పటి నుంచే పెంచిన పెన్షన్లతో బకాయిల విడుదల కోసం ఉద్యమ కార్యాచరణ ఉంటుందని వెల్లడించారు. అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

మాదిగల ఉనికే లేకుండా చేస్తున్న రేవంత్‌రెడ్డి

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

నర్సింహులు

ఖైరతాబాద్, జూన్ 21: తెలంగాణలో మాదిగల ఉనికే లేకుండా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్ని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మొదటి నుంచి మాదిగలను మోసం చేస్తూ వస్తుందని, 80 లక్షల జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మాదిగల్లో రాజకీయ చైతన్యం లేకపోవడం వల్లే ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో కాపులంతా ఒకే తాటిపై నిలబడడం వల్లే పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారని తెలిపారు. ఇప్పుడు ఆ కులానికి ఎంతో విలువ పెరిగిందని చెప్పారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మాదిగల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఉస్మానియా అధ్యాపకుడు ప్రొఫెసర్ కాశీం, సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్, గణేశ్, ప్రభాకర్, ఆంజనేయులు, డాక్టర్ సంజీవ్‌నాయక్, రజనీ, పవన్‌కుమార్, నారాయణ, వెంకటేశ్వర ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ

'సీస' పద్యం చెప్తా., రాసుకోండ్రా!

వచ్చే వారం నుంచి భారీ వర్షాలు!

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఇప్పటికే విత్తనాలు నాటి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తీపికబురు అందించింది. వచ్చే వారం నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. రాబోయే మూడు రోజులపాటు ఎండలు కూడా ఉంటాయని, కొన్ని జిల్లాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదుకావొచ్చని తెలిపింది. మరోవైపు 22వ తేదీన (నేడు) ఉత్తర తెలంగాణలో భారీ వర్షం కురువొచ్చని ఇండో-జర్మన్ నిపుణులు అంచనా వేశారు.

హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి సీతక్కకు వినతి

బన్సీలాల్‌పేట్, జూన్ 21: హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కోత్వాల్ దయానంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి సీతక్కను హోంగార్డులు కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి సైతం విన్నవించారు. ఈ సందర్భంగా కోత్వాల్ దయానంద్ మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా పోలీసు శాఖలో విధులను నిర్వహిస్తున్న 16వేల మంది హోంగార్డులకు ఉద్యోగ భద్రత కరువైందని, క్రమబద్ధీకరణ చేయడం లేదని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి హోంగార్డుల నియామకాలను చేపడతామని ప్రకటించారని, అందులో వెయింటింగ్‌లో ఉన్న హోంగార్డులకు ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు సమస్యలను పరిష్కరించాలని కోరారు. తమను స్పెషల్ పోలీసు అసిస్టెంట్ క్యాడర్‌గా పరిగణించాలని పేర్కొన్నారు.

వాణిజ్య

టెక్టోరోకు గూగుల్ గ్రోత్ అవార్డు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్‌లో విశేషమైన సహకారం అందించినందుకుగాను గూగుల్ నుంచి ప్రతిష్ఠాత్మక యాక్సిలరేటర్ అవార్డును అందుకున్నది టెక్టోరో కన్సల్టింగ్ సంస్థ. లండన్‌లో జరిగిన ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ గ్లోబల్ పార్ట్‌నర్ సమ్మిట్‌లో ఈ అవార్డును టెక్టోరో ఎండీ శ్రీధర్ దన్నపనేని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ దన్నపనేని మాట్లాడుతూ.. గ్రోత్ యాక్సిలరేటర్ అవార్డును అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ గుర్తింపు అంకితభావంతో కూడిన మా బృందానికి, వారి కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు.

జేకే టైర్ 120 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జూన్ 21: ప్రముఖ టైర్ల సంస్థ జేకే టైర్..కమర్షియల్ వాహనాలను దృష్టిలో పెట్టుకొని మార్కెట్లోకి మరో నాలుగు టైర్లను విడుదల చేసింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రెసిడెంట్ అనుజ్ కథూరియా మాట్లాడుతూ.. అడ్వాన్స్ టెక్నాలజీతో రూపొందించిన ఈ టైర్లతో కమర్షియల్ వాహనాల నిర్వహణ ఖర్చులు తగ్గుముఖం పట్టనున్నాయని, ఈ నూతన శ్రేణి టైర్లను రూపొందించడానికి మైసూరులో రూ.600 కోట్ల పెట్టుబడితో ప్రత్యేకంగా పరిశోధన-అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే ఆర్‌అండ్‌డీ కోసం ప్రతియేటా రూ. 120 కోట్ల మేర పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపారు.

ఫార్మా కోసం ప్రత్యేక క్లస్టర్!

హైదరాబాద్, జూన్ 21: ఫార్మా సర్వీసుల కోసం ప్రత్యేక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఫార్మా రంగ ప్రతినిధులు సూచించారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఫార్మా రంగ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ తెలంగాణ ఫార్మా అండ్ లైఫ్ సెన్సెస్ ప్యానెల్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కన్వీనర్ శిల్పా రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో 800కి పైగా లైఫ్ సెన్సెస్ కంపెనీల విలువ 50 బిలియన్ డాలర్లకు పైగా ఉన్నదని, అలాగే దేశీయ ఫార్మా ఉత్పత్తుల్లో ఇక్కడి నుంచే 40 శాతం ఉత్పత్తి అవుతున్నాయన్నారు. ఇందుకోసం కొత్తగా ప్రత్యేక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆర్థిక అసమానతలు తగ్గవు!

రాయిటర్స్ పోల్‌లో 84 శాతం ఆర్థికవేత్తల అభిప్రాయమిదే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రానున్న ఐదేండ్లలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడమే తన లక్ష్యమని లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఊదరగొట్టారు. భారత్ మెరుగైన వృద్ధిరేటుతో దూసుకుపోతున్నదని కేంద్రప్రభుత్వ ఏజెన్సీలూ గతకొంతకాలంగా ప్రచారం చేస్తున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధి 8 శాతం వరకు ఉన్నట్టు కేంద్రం ప్రకటించింది. అయితే, ఎవరెన్ని చెప్పినప్పటికీ, దేశంలో ఆర్థిక అసమానతలు మాత్రం తగ్గే సూచనలు కనిపించడం లేదని ఆర్థిక నిపుణులు, మేధావులు తేల్చిచెప్తున్నారు. స్టాక్‌మార్కెట్ల సూచీలు, జీడీపీ వృద్ధిరేటును చూసి పేదలు, మధ్యతరగతి వర్గాలకు లాభం చేకూరుతుందని అనుకొంటే అది పొరపాటేనని చెబుతున్నారు. రానున్న ఐదేండ్ల మోదీ ప్రభుత్వ హయాంలో పేదలకు కొత్తగా ఒరగబోయేది ఏమీ ఉండబోదని స్పష్టం చేస్తున్నారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో.. ఇప్పటికీ 80 కోట్ల మందికి ఉచిత బియ్యం సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్' సంస్థ మే 15-జూన్ 18 మధ్య నిర్వహించిన పోల్‌లో వెల్లడైంది. పోల్‌లో పాల్గొన్న మొత్తం 51 మంది ఆర్థికవేత్తల్లో .. ఏకంగా 43 మంది రానున్న ఐదేండ్లలో మోదీ హయాంలో దేశంలో ఆర్థిక అసమానతలు తగ్గే అవకాశమే లేదని, పేదల కష్టాలు తీరబోవని తేల్చిచెప్పడం గమనార్హం.



మెజారిటీ తగ్గడానికి కారణం ఇదే

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ సీట్లు రాకపోవడానికి కారణాలను కూడా ఆర్థికవేత్తలు విశ్లేషించారు. దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలు, పెచ్చరిల్లిన నిరుద్యోగమే దీనికి కారణంగా వివరించారు. 2047లోగా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తానని ప్రధాని అంటున్నారని, అయితే, నైపుణ్యం కలిగిన మానవ వనరులను పెంచడం, నిరుద్యోగాన్ని రూపుమాపడం, సమ్మిళిత వృద్ధితోనే ఇది సాధ్యమౌతుందని ఆర్థిక నిపుణులు సూచించారు. దేశ ఆర్థిక ప్రగతికి నిరుద్యోగమే పెద్ద సమస్యగా మారిందని పోల్‌లో పాల్గొన్న 90 శాతం మంది అభిప్రాయపడ్డారు.

ధనికులు మరింత సంపన్నులుగా..

ప్రస్తుత ప్రభుత్వం తీసుకొస్తున్న విధానపరమైన నిర్ణయాలతో మధ్యతరగతి వర్గాల నడ్డివిరుగుతున్నది. ఉచితాల కోసం పేదలు ప్రభుత్వంపై పూర్తిగా ఆధారపడే దుస్థితి దాపురించింది. అయితే, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, చేయూతతో ధనికులు మరింత సంపన్నులుగా మారుతున్నారు.

- సాయిబాలకర్, ప్రొఫెసర్, సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్ సైన్సెస్

బడ్జెట్‌లో రోబో ట్యాక్స్?

ప్రతిపాదనను పరిశీలిస్తున్న కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 21: రాబోయే బడ్జెట్‌లో కొత్తగా 'రోబో ట్యాక్స్'ను కేంద్ర ప్రభుత్వం తీసుకురానుందా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ మేరకు ప్రతిపాదన వచ్చినట్టు తెలుస్తుండగా, దీన్ని అమల్లోకి తెచ్చే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను వచ్చే నెల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నారు. దీంతో వృద్ధిరేటు, ఉద్యోగ కల్పన, ఆర్థిక విధానాలు, పెట్టుబడులు, రుణ భారం, ఆహార ద్రవ్యోల్బణం వంటి ప్రధానాంశాలపై ఆయా రంగాల పెద్దలతో, ఆర్థిక నిపుణులతో మంత్రి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే 'రోబో ట్యాక్స్' పరిశీలన తెరపైకి వచ్చింది.

ఏమిటిది?

కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావంతో ఇటీవలికాలంలో ఉద్యోగాలు పెద్ద ఎత్తున పోతున్నాయి. బడా కార్పొరేట్ సంస్థలన్నీ మానవ శక్తికి బదులుగా రోబో ఆధారిత శక్తిపై దృష్టి సారిస్తున్న ఫలితమే ఇదంతా. దీంతో ఏఐ కారణంగా కొలువుల్ని కోల్పోయినవారిలో నైపుణ్యం పెంచేందుకు, అందుకయ్యే ఖర్చులకు నిధుల సమీకరణ కోసం ఓ ఆర్థికవేత్త నుంచి వచ్చినదే ఈ 'రోబో ట్యాక్స్' ప్రతిపాదన. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేపర్‌కు అనుగుణంగానే దీన్ని ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. ఏఐ రాకతో లాభాలున్నా.. భారీగా ఉద్యోగాలు పోతాయని, చాలామందికి ఇది బాధాకరమని ఐఎంఎఫ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. అందుకే నైపుణ్యాభివృద్ధి, నిరుద్యోగ బీమా కవరేజీ, వేతన బీమాలతోపాటు ప్రస్తుత కార్పొరేట్ ట్యాక్స్ వ్యవస్థల్ని పునఃసమీక్షించాలని ఐఎంఎఫ్ ప్రపంచ దేశాలకు సలహా కూడా ఇచ్చింది. ఇక అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏఐతో పెద్ద ముప్పే పొంచి ఉన్నదని ఐఎంఎఫ్ తొలి డిప్యూటీ ఎండీ గీతా గోపీనాథ్ కూడా హెచ్చరించినది తెలిసిందే.

వ్యవసాయానికి పెద్దపీట వేయాలి

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో శుక్రవారం జరిపిన ముందస్తు బడ్జెట్ చర్చల్లో వ్యవసాయ రంగ సంఘాలు, నిపుణులు.. వ్యవసాయ సంబంధిత పరిశోధనలకు ప్రాధాన్యతనివ్వాలని కోరాయి. అలాగే ఎరువుల సబ్సిడీని హేతుబద్ధం చేయాలని, వాతావరణ మార్పులతో తలెత్తుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, వ్యవసాయ రంగ స్థితిస్థాపకతకు తోడ్పడేలా కావాల్సిన అన్ని మౌలిక వసతులను కల్పించాలని సూచించాయి. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి కోసం ఈసారి బడ్జెట్‌లో రూ.20,000 కోట్ల నిధులు కేటాయించాలన్న డిమాండ్లు వినిపించాయి.

పన్నులు తగ్గించాలి

మార్కెట్‌లో మందగించిన డిమాండ్‌ను తిరిగి ఉత్తేజపర్చేందుకు వ్యక్తిగత పన్నులను తగ్గించాలని భారతీయ రిటైలర్ల సంఘం కోరింది. తక్కువ వడ్డీకే రుణాలు, భూముల ధరలపై రాయితీలు, ప్రయోజనాలు ఇవ్వాలన్నది. విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలనూ కల్పించాలన్నది. వ్యవసాయం తర్వాత అత్యధికులు ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారని గుర్తుచేసింది. దుకాణాలు నిరంతరం తెర్చుకునేలా వీలు కల్పించాలన్నది.

తగ్గిన ఫారెక్స్ నిల్వలు

ముంబై, జూన్ 21: విదేశీ మారకం నిల్వలు మళ్లీ కరిగిపోయాయి. ఈ నెల 14తో ముగిసిన వారాంతానికిగాను 2.922 బిలియన్ డాలర్లు తగ్గి 652.895 బిలియన్ డాలర్లకు చేరాయని రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. అంతక్రితం వారం రికార్డు స్థాయి 655.817 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. గత వారంలో విదేశీ కరెన్సీల రూపంలో ఉన్న ఆస్తుల విలువ 2.097 బిలియన్ డాలర్లు తగ్గి 574.24 బిలియన్ డాలర్లకు చేరడం ఇందుకు కారణమని తెలిపింది. యూరో, పౌండ్, యెన్ కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురికావడం విదేశీ రిజర్వులపై ప్రతికూల ప్రభావం చూపింది. బంగారం రిజర్వులు కూడా 1.015 బిలియన్ డాలర్లు తగ్గి 55.967 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఎస్‌డీఆర్‌లు 54 మిలియన్ డాలర్లు తగ్గి 18.107 బిలియన్ డాలర్లకు పడిపోగా, ఐఎంఎఫ్ వద్ద నిల్వలు 245 మిలియన్ డాలర్లు పెరిగి 4.581 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

పసిడి-వెండి జిగేల్

- ఒక్కరోజే రూ.810 పెరిగిన తులం బంగారం
- 1,500 ఎగిసిన కిలో వెండి రేటు

న్యూఢిల్లీ, జూన్ 21: బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ పుత్తడి రేటు రూ.810 పుంజుకొని రూ.73,250ని చేరింది. 22 క్యారెట్ ధర రూ.750 అందుకుని రూ.67,150గా నమోదైంది. వరుసగా 4 రోజులు స్థిరంగా లేదా పడిపోతూ వచ్చిన పసిడి విలువ.. గురువారం కూడా పెరిగిన విషయం తెలిసిందే. ఇక వెండి ధర మరో రూ.1,500 ఎగబాకింది. కిలో 94,000 పలుకుతున్నది. క్రితం రోజు కూడా రూ.1,500 ఎగిసిన సంగతి విదితమే. ఢిల్లీలోనూ 24 క్యారెట్ బంగారం రూ.73,350గా, కిలో వెండి రూ.93,700గా ఉన్నది. ఈ ఒక్కరోజే రూ.800, రూ.1,400 చొప్పున ఎగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే.. కొమెక్స్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర ఒకేసారి 28 డాలర్లు పెరిగి